
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 31 । జూలై । 2024


స్లీపర్‌లో కిక్కిరిసిన ప్రయాణం


గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వద్ద ప్రయాణికుల రద్దీ


గోదావరి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌ల వద్ద ప్రయాణికుల పాట్లు

రైలు బండి.. చోటేదండీ?


జనరల్ కోచ్‌లను తలపిస్తున్న స్లీపర్ కోచ్


స్లీపర్ కోచ్‌లో ప్రయాణికుల అవస్థలు

- భారమవుతున్న రైలు ప్రయాణం
- జనరల్, స్లీపర్ కోచ్‌ల కుదింపుతో ఇబ్బందులు
- స్లీపర్, థర్డ్ ఏసీలో రిజర్వేషన్ దొరక్క అవస్థలు
- దువ్వాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్న 30కి పైగా రైళ్లు
- సాధారణ ప్రయాణికులపై రైల్వే చిన్నచూపు

విశాఖ రైల్వేస్టేషన్.. సాయంత్రం 5 గంటలు.. డిబ్రూగఢ్–కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మూడో నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వచ్చింది. ప్రయాణికులు గుంపుగా చేరిపోయారు. అప్పటికే జనరల్ బోగీ ప్రయాణికులతో కిక్కిరిసింది. తొక్కేసుకొని ఏదో రకంగా ఎక్కేశారు. కాలు దూరే ప్లేస్ ఉంటే చాలు.. అదే ఏసీ బెర్త్ అంటూ దూసుకెళ్లారు. వందేభారత్‌లు.. అమృత్‌లు బదులు.. ఉన్న రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయవచ్చు కదా అంటూ రైల్వే శాఖను తిట్టిపోసుకుంటూ బయలుదేరారు.

సాయంత్రం 5 గంటలు.. గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం 8పైకి వచ్చింది. జనరల్ బోగీ కేవలం 2 నిమిషాల్లోనే కిక్కిరిసిపోయింది. కనీసం బాత్‌రూమ్ వైపు వెళ్లేందుకు కూడా అడుగు జాగా లేకుండా పోయింది. సాయంత్రం ఎక్కితే ఉదయాన్నే సికింద్రాబాద్‌లో దించేసే రైలు కాబట్టి.. కనీసం నిలబడి వెళ్లిపోతే చాలు.. అదే పదివేలు అంటూ నిట్టూరుస్తూ ప్రయాణికులు భాగ్యనగరం పయనమయ్యారు.

మధ్యాహ్నం 1.50 గంటలకు వచ్చే గౌహతీ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే సీన్ రిపీట్.. ఈ మూడు రైళ్లే కాదు.. ప్రతీ రైలులోని జనరల్ బోగీలో ప్రయాణమంటే యుద్ధమే. గమ్యస్థానం చేరేలోపు కూర్చోడానికైనా.. కుదరుగా నిల్చోడానికైనా ప్లేస్ దొరకబుచ్చుకున్న పేదోడే రారాజు. అలా మారిపోయింది.. కాదు కాదు.. మధ్య తరగతి ప్రయాణాన్ని అలా మార్చేసింది రైల్వే బోర్డు.

సాక్షి, విశాఖపట్నం/తాటిచెట్లపాలెం : నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేసే వాల్తేరు రైల్వే స్టేషన్‌లో రైలెక్కే సామాన్యుడి పరిస్థితి దయనీయంగా ఉంది. సీట్లు తక్కువగా ఉండటం, స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇదే సమయంలో దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే రైళ్లలో స్లీపర్ కోచ్‌ల కుదింపు ప్రక్రియను రైల్వే మంత్రిత్వ శాఖ అమలు చేయడంతో రైలు ప్రయాణం మరింత భారంగా, భయంగా మారిపోయింది. జనరల్ కోచ్‌లతో సమానంగా రిజర్వ్‌డ్ క్లాస్ కోచ్‌లు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. విశాఖ నుంచి బయలుదేరిన మూడు రైళ్లను 'సాక్షి' పరిశీలించగా.. ఈ విషయం తేటతెల్లమైంది.

- గౌహతి–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మంగళవారం కిక్కిరిసి విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలులో జనరల్, స్లీపర్ క్లాస్‌లలో కనీసం కాలుమోపేందుకు కూడా ఖాళీ లేదు. ఈ రైలులో 4–జనరల్, 7–స్లీపర్ కోచ్‌లుండగా మిగిలిన 8 ఏసీ కోచ్‌లే. ఓ జనరల్ కోచ్‌లో 108 మంది వరకు ప్రయాణించవచ్చు. కానీ ఈ రైలులోని ఒక్కో జనరల్ కోచ్‌లో 200 మంది కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో కేవలం 78 బెర్తులు మాత్రమే ఉంటాయి. కానీ ఈ రైలులోని స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో సుమారు 150 మంది చొప్పున ప్రయాణికులున్నారు.
- డిబ్రూగఢ్–కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే విధంగా వెళ్లింది. ఈ రైలులో కేవలం మూడు కోచ్‌లను మాత్రమే సాధారణ ప్రయాణికులకు కేటాయించారు. 11 స్లీపర్, 5 ఏసీ కోచ్‌లు ఉన్నాయి. ఈ రైలులో కూడా సాధారణ, స్లీపర్ కోచ్‌ల్లో ఒక్కోదాంట్లో 150 మందికి తక్కువ కాకుండా ప్రయాణిస్తున్నారు. జనరల్ కోచ్‌ల్లో ఒక్కో సీటులో నలుగురు కూర్చోవచ్చు. కానీ కనీసం ఏడుగురు కూర్చున్నారు.
- ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్. ఈ రైలు ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. ఈ రైలులోని జనరల్ కోచ్‌ల్లో కనీసం కాలుమోపలేం. కారణం ఈ రైలుకు ఉన్నవి కేవలం రెండే జనరల్ కోచ్‌లు. వాటిలో ఒక కోచ్ సగం ఆర్ఎంఎస్‌కు కేటాయిస్తారు. దీంతో జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించడం అసాధ్యం. ఇక ఈ రైలుకు గతంలో 12 స్లీపర్ క్లాసు కోచ్‌లుండేవి. కానీ ప్రస్తుతం వీటి సంఖ్య 8కి పడిపోయింది. స్లీపర్ క్లాస్ కోచ్‌ల స్థానంలో ఏసీ కోచ్‌లను జతచేసి.. స్లీపర్, జనరల్ కోచ్‌లను తగ్గించేసింది.

ప్రధాన రైళ్లు రద్దు.. స్పెషల్ రైళ్ల వైపు మొగ్గు

ప్రయాణికులకు అత్యంత డిమాండ్ ఉన్న రైళ్లను సైతం తరచూ రద్దు చేస్తోంది. దీని వల్ల మధ్య తరగతి కుటుంబాలకు ప్రయాణాలు చేయాలంటే కష్టంగా మారింది. గత ఆరు నెలల నుంచి విశాఖపట్నం–విజయవాడ మధ్య పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఇదే మార్గంలో నడిచే వందేభారత్ రైళ్లు, పలు స్పెషల్ రైళ్లు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉన్న కొద్దిపాటి రైళ్లలో సాధారణ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తగ్గించి, ఏసీ కోచ్‌ల వైపు రైల్వే మొగ్గు చూపుతోంది. దీంతో కొన్ని సార్లు స్లీపర్ క్లాస్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌ల కంటే దారుణంగా ఉంటున్నాయి.


6 గురు ప్రయాణించే సీట్లలో పది మందికి పైనే..

వెయిటింగ్ కంటే.. ఇదే నయం : సాధారణంగా రైలు ప్రయాణమంటే.. కచ్చితంగా ముందస్తు ప్లాన్ అవసరం. మూడు నెలల ముందే రిజర్వేషన్ ఓపెన్ చేస్తారు. కేవలం రోజుల వ్యవధిలోనే దాదాపు 80 శాతం రైళ్లు సీట్లు రిజర్వ్ అయిపోతుంటాయి. ఇక వెయిటింగ్ లిస్ట్ చూస్తే.. 150, 200, 250.. ఇలా సెంచరీల మీద సెంచరీలు కొడుతుంటుంది. కన్ఫర్మ్ అవుతుందన్న ఆశ పూర్తిగా చచ్చిపోతుంటుంది. వెయిటింగ్ లిస్ట్‌పై స్లీపర్ క్లాస్‌లో వెళ్లి.. అందరితో చీవాట్లు తినే బదులు.. జనరల్ బోగీలో వెళ్లి కాస్తా ఓపికపడితే చాలు అని ప్రతి ఒక్క ప్రయాణికుడు భావిస్తున్నారు.

ఏసీ కోచ్‌లకు డిమాండ్

స్లీపర్ కోచ్‌లు రిజర్వ్ ఫుల్ అయిన వెంటనే.. థర్డ్ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్‌క్లాస్‌పై పడుతున్నారు. దీంతో ఆ బోగీలకు కూడా డిమాండ్ పెరిగిపోతోంది. అందుకే స్లీపర్, జనరల్ బోగీలు తగ్గించి.. ఆదాయం పెంచుకునేందుకు రైల్వే శాఖ ఏసీ కోచ్‌లు పెంచుతూ.. పేదోడి ప్రయాణాన్ని మరింత భారంగా మార్చేసింది.

బైపాస్‌తో మరింత భారం

విశాఖ రైల్వేస్టేషన్‌లో మొత్తం 8 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. అయితే రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో శివార్లలో రైళ్లను గంటల తరబడి నిలిపేస్తున్న పరిస్థితుల దాపురించాయి. అందుకే కొన్ని రైళ్ల సర్వీసులను దువ్వాడ వైపుగా దారి మళ్లించేస్తున్నారు. విశాఖకు రాకుండా ప్రస్తుతం 30కి పైగా రైళ్లు బైపాస్ నుంచి వెళ్లిపోతుండటం ప్రయాణికుల కష్టాలను మరింత పెంచుతున్నాయి.

జనరల్ బోగీ.. కిక్కిరిసి..



ప్రతీ రోజు గోదావరి ఎక్స్‌ప్రెస్ పరిస్థితి ఇంతే. జనరల్ కోచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నాం. విజయవాడ వరకు వెళ్లేందుకు ఈ రైలెక్కా. ఇది తప్ప వేరే రైలు లేకపోవడంతో అందరూ ఇదే రైలుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ రైలులో జనరల్ కోచ్‌లు కేవలం రెండే ఉన్నాయి. స్లీపర్ కోచ్‌ల్లో ఎక్కాలంటే ఫైన్ కట్టాలి. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా వేలాడుతూ వెళ్తున్నా..

– పి.ప్రవీణ్, శ్రీకాకుళం

రైల్వే మినిస్టర్ సార్ నా వల్ల కాలేదు



మూడు నెలల ముందు నుంచి టికెట్ బుక్ చేసుకోడానికి ట్రై చేసినా కుదరలేదు. గోదావరికి టికెట్ దొరకడం గగనమైపోయింది. అర్జెంట్ పని ఉండి హైదరాబాద్ వెళ్లేందుకు గోదావరి కోసం వచ్చాను. జనరల్ బోగీ ఎక్కాలని ప్రయత్నించాను. నా వల్ల కాలేదు. అయ్యా.. రైల్వే మినిస్టర్ సార్.. దేశంలో రైళ్లలో ప్రయాణించే వారిలో ఎక్కువ మంది సాధారణ ప్రయాణికులే ఉంటారు.

– ఎస్.ఈశ్వరరావు, ప్రయాణికుడు

కోయంబత్తూరు వరకూ ఇలాగేనా..



మాది శ్రీకాకుళం జిల్లా. మేం కోయంబత్తూరులో పనిచేస్తున్నాం. వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో శ్రీకాకుళం స్టేషన్‌లో ఎక్కాం. ఇద్దరం నిలబడటానికి కొంత ప్లేస్ దొరికింది. విజయవాడ వైపు వెళ్లే కొద్దీ రష్ పెరుగుతుంటుంది. అప్పటికి ఈ ప్లేస్ ఉంటుందో లేదో కూడా తెలీదు. దాదాపు 1,300 కిలోమీటర్లు వెళ్లాలి. రెండు రోజులు పడుతుంది. కోయంబత్తూరు వెళ్లేంత వరకూ ఈ నరకయాతన తప్పదు.

– దుర్గాప్రసాద్, రమేష్, ప్రయాణికులు

స్లీపర్ కోచ్‌లు పెంచాలి



ఎంతో ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాలేదు. ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండటంతో సీటు లేకున్నా అడ్జస్ట్ అయి వెళ్తున్నా. అందరూ ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించ లేరు కదా! స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఎక్కువ వేస్తే ఉపయోగంగా ఉంటుంది. జనరల్ ప్రయాణికులు కూడా రిజర్వేషన్ బోగీల్లో ఎక్కడం వల్ల రిజర్వేషన్ చేయించుకున్నా ఉపయోగం లేకుండా పోతోంది. జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌ల సంఖ్యను పెంచాలి.

– పి.భవేష్‌కుమార్, బెంగళూరు

న్యూస్‌రీల్

స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మోగిన నగారా

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్
- అమల్లోకి వచ్చిన కోడ్


సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు మంగళవారం విశాఖ కలెక్టర్, ఎన్నికల అధికారి హరేందిర ప్రసాద్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నారు. కాగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గతంలో వైఎస్సార్ సీపీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపొందారు. ఆయన సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేనలో చేరడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఈ స్థానానికి గానూ ఇప్పుడు ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ముఖ్యమైన తేదీలివే..

ఎన్నికల నోటిఫికేషన్	ఆగస్టు 6
నామినేషన్‌కు చివరి తేదీ	ఆగస్టు 13
నామినేషన్ల పరిశీలన	ఆగస్టు 14
నామినేషన్ విత్‌డ్రా	ఆగస్టు 16
పోలింగ్	ఆగస్టు 30
కౌంటింగ్	సెప్టెంబర్ 3

సూరంపాలెం రిజర్వాయర్‌కు వరద తాకిడి

- ఒక గేటు ద్వారా 350 క్యూసెక్కుల విడుదల


విడుదల అవుతున్న వరద నీరు

గంగవరం : వర్షాల కారణంగా సూరంపాలెం రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరడంతో రిజర్వాయర్‌కు సంబంధించి ఒక గేటును 0.5 సెంటీమీటర్లు ఎత్తి 350 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటిమట్టం 105 మీటర్లకు చేరుకోవడంతో అదనపు జలాలను దిగువకు వదులుతున్నారు.

వారం రోజులుగా ముంపులోనే ఉన్నాం

- కనీసం టార్పాలిన్లు కూడా ఇవ్వలేదు
- త్వరగా ప్యాకేజీ ఇచ్చి పంపించండి
- ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ దినేష్‌కుమార్ వద్ద బాధితుల ఆవేదన


కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే శిరీషాదేవికి సమస్యలు వివరిస్తున్న వరద బాధితులు

కూనవరం: మా కాలనీ వారం రోజుల నుంచి ముంపులోనే ఉంది. మేమంతా పునరావాస కేంద్రంలో ఉన్నాం. కనీసం బరకాలు కూడా ఇవ్వలేదు,.. ప్రతి సంవత్సరం ఈ కష్టాలు పడలేం. త్వరగా పోలవరం ప్యాకేజీ ఇచ్చి పంపించండి అని వరద బాధితులు రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం మండలంలోని కోతులగుట్ట ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులకు తక్షణ సాయం రూ.3వేలు, 25 కిలోల బియ్యాన్ని వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముంపు బాధితులు సత్యారపు బుజ్జిబాబు, గద్దం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేమంతా ఉదయ భాస్కర్ కాలనీకి చెందిన వారమని, మా కాలనీ గత వారం రోజులుగా ముంపులోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ శ్లాబ్‌లు అన్నీ నాప రాళ్లతో నిర్మించడం వల్ల ఏటేటా వచ్చే వరదలకు వాటి జాయింట్లలో ఖాళీలు ఏర్పడ్డాయని, కొద్దిపాటి వర్షం వచ్చినా కారిపోతోందని తెలిపారు. కనీసం బరకాలు (టార్పాలిన్లు) ఇచ్చినా వాటిపైన వేసుకుందామని అనుకున్నామని తెలిపారు. ప్రతీ కుటుంబానికి రెండేసి బరకాల చొప్పున గత వరదలలో పంపిణీ చేశారని, ఈసారి ఒక్క బరకం కూడా అందలేదన్నారు. ముంపు మండలాల సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో ఉన్నాయని, ఇటీవల తాను కూడా అసెంబ్లీలో ప్రస్తావించానని, త్వరలో ప్యాకేజీ ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సూరజ్ గనోరే, చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య, రంపచోడవరం ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, ఏఎస్పీ రాహూల్ మీనా, తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ, సీఐ రామారావు పాల్గొన్నారు.

అడుగడుగునా తనిఖీలు


కొండపడ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంతో పాటు కుమడ, జోలాపుట్టు, డుడుమ, పెదబయలు వెళ్లే మార్గాలలో స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అడుగడుగున ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద బందోబస్తు. ఏవోబీ నుంచి వచ్చే వాహనదారుల బ్యాగులు, లగేజీలు క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి వివరాలు సేకరించి విడిచిపెట్టారు.మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో తనిఖీలు విస్తృతం చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. జోలాపుట్టు వెళ్లే నైట్ హాల్ట్ బస్సులను మండల కేంద్రానికే పరిమితం చేశారు. దీంతో పాటు ఏవోబీలో ఆంధ్రా- ఒడిశా పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తూ అటవీ ప్రాం

గిరిజన విద్యార్థికి సత్వర వైద్యం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో కేజీహెచ్‌లో శస్త్ర చికిత్స
- మెదడులో కణితి తొలగింపు
- అనారోగ్యం నుంచి కోలుకున్న మోహన్ ప్రేమ్‌కుమార్



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న ప్రేమ్‌కుమార్

కొయ్యూరు: మెదడులో కణితి వల్ల అస్వస్థతకు గురైన గిరిజన విద్యార్థికి పాడేరు ఐటీడీఏ పీవో చొరవతో కేజీహెచ్‌లో వైద్యనిపుణులు శస్త్రచికిత్స నిర్వహించారు. దీంతో కోలుకున్న విద్యార్థి ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్నాడు. చింతపల్లి మండలం ఎర్రబొమ్మలి పంచాయతీ కుడుబిసింగికి చెందిన టి.మోహన్ ప్రేమ్‌కుమార్ స్థానిక గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అతను తరచూ అనారోగ్యానికి గురికావడంతో పాఠశాల సిబ్బంది ఈనెల 11న రాజేంద్రపాలెం ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడి నుంచి వారు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు విశాఖలోని కేజీహెచ్‌కు పంపించారు. అక్కడ స్కానింగ్ వైద్యనిపుణులు మెదడులో కణితిని గుర్తించి వెంటనే ఈనెల 15న శస్త్రచికిత్స చేశారు. సుమారు 12 రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థి మోహన్ ప్రేమ్‌కుమార్ ఆరోగ్యంతో ఇంటికి వచ్చినట్టు కొయ్యూరు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో అత్యవసర వైద్యం అందించేందుకు కృషి చేసిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు తల్లిదండ్రులు జగన్, మౌనిక కృతజ్ఞతలు తెలిపారు.

అన్నలారా..అభివృద్ధిని అడ్డుకోవద్దు

మావోయిస్టులకు వ్యతిరేకంగా గురుకుల కళాశాల విద్యార్థుల ర్యాలీ


మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల కళాశాల విద్యార్థులు

జి.మాడుగుల: మండలంలోని సంతబయలు గ్రామంలో మంగళవారం జరిగిన వారపుసంతలో గురుకుల కళాశాల విద్యార్థులు మావోయిస్టు వారోత్సవాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టులారా? ఈ వారోత్సవాలు ఎందుకు? ఎవరి కోసం? నిరాయుధులైన అమాయక గిరిజనులను కిరాతకంగా చంపిన మీరు వీరులా?, శూరులా?అంటూ బ్యానర్లను వారు ప్రదర్శించారు. మీ వల్ల మాకు అభివృద్ధి కుంటుపడుతున్నందున అన్నలారా..? మీరు మా అభివృద్ధి గురించి ఆలోచిస్తే మాకు రోడ్లు, రవాణా కమ్యూనికేషన్, మంచినీటి సౌకర్యం కల్పనకు సహకరించి పోరాటం చేయండని కోరారు. అంతేకాని అభివృద్ధికి అడ్డంగా నిలవకూడదని వారు హితవు పలికారు. మాకు మేలు చేసేవిధంగా అభివృద్ధి జరుగుతున్నప్పుడు రోడ్లు వేస్తున్న వారిని, కాంట్రాక్టర్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను, సెల్ టవర్లను ధ్వంసం చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకోవద్దు అన్నలారా?.. గంజాయి వద్దు, ఆరోగ్యం ముద్దు అంటూ పురవీధుల్లో వారు నినాదాలు చేశారు.

అడుగుకో గాథ.. కన్నీటి వ్యథ

- ముంపు గ్రామాల్లో దయనీయంగా జీవనం
- నిర్మానుష్యంగా పల్లెలు
- ఒండ్రు మట్టితో పేరుకుపోయిన ఇళ్లు
- పత్తి రైతుకు, రోడ్లకు తీవ్ర నష్టం

గోదావరి, శబరి నదుల వరదలు విలీన మండలాల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేశాయి. సాఫీగా సాగుతున్న బతుకులను రోడ్డు పాల్జేశాయి. నిత్యం సందడిగా ఉండే పల్లెలు జనసంచారం లేక నేడు నిర్మానుష్యంగా మారాయి. ఒండ్రు మట్టి పేరుకుపోయిన ఇళ్లలో ఉండలేక...అటు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోలేక బాధిత కుటుంబాలు బస్ షెల్టర్లలో ఉండి వంటలు చేసుకుని తింటున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి. ఎన్నాళ్లీ కష్టాలని ఆవేదన చెందుతున్నాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఈ బాధలనుంచి తమకు విముక్తి కలిగించాలని పాలకులకు మొరపెట్టుకుంటున్నాయి.


మురుమూరు వద్ద గోదావరి వరదకు ధ్వంసమైన రహదారి


నందిగామ వాగు బ్రిడ్జి వద్ద రహదారిపై పేరుకుపోయిన ఒండ్రు మట్టి


గన్నవరంలో బస్ షెల్టర్‌లో ముంపు బాధిత కుటుంబాలు

ఎటపాక: వర్షాలు.. ఉప్పొంగిన గోదావరి, శబరి నదులు విలీన మండలాల ప్రజలకు వ్యధను మిగిల్చాయి. నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, మరోపక్క గోదావరి వరదలతో అటు సామాన్యులు ఇటు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సాగుకోసం రూ.వేలు అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు నీటిపాలవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈనెల ప్రారంభంలో పత్తి సాగు చేపట్టిన రైతులను వరదలు నిండా ముంచాయి. ఎక్కువగా వాగులు, వంకలు, చెరువుల ప్రాంతాల్లోని ఆయకట్టు రైతులు కోలుకోలేని విధంగా నష్టాన్ని చవిచూశారు.

61 హెక్టార్లలో పంటలకు..

వర్షాలు, వరదలకు మండలంలో 61 హెక్టార్లలో పత్తి, రెండు హెక్టార్లలో వరి నారుమడులకు నష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఎటపాక, చెన్నంపేట, సీతంపేట, బొజ్జిగుప్ప, గుండాల, నందిగామ తదితర గ్రామాల్లో అధికవర్షాలకు ప్రత్తి పైరులో విపరీతమైన కలుపు వచ్చింది. వీటిని తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సాగు ప్రారంభంలోనే వరదలు, వర్షాలు ఇన్ని కష్టాలను తెచ్చిపెడితే ఎలా తేరుకునేదని ఆందోళన చెందుతున్నారు.

రహదారుల ధ్వంసం

భారీ వర్షాలకు వరద ఉధృతిగా ప్రవహించడంతో రహదారులు కొట్టుకుపోయాయి. వీరాయిగూడెం, గొరిదేవిపేట మురుమూరు వద్ద ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. గన్నవరం ప్రధాన రహదారిపై జాలర్ల గుడిసెలు నీట మునగడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. గోదావరి వరద భద్రాచలం వద్ద 53 అడుగులు దాటడంతో నందిగామ, గన్నవరం వద్ద నివాసాలు నీటమునిగాయి. వరద తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాల నుంచి బాధితులు తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. అయితే ఇళ్లలో పేరుకుపోయిన ఒండ్రు మట్టిని తొలగింపునకు శ్రమిస్తున్నారు.

ఎక్కడ ఉండాలి.. ఏం తినాలి?

విలీన మండలాల్లో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. వరద ముంపు తగ్గిన తరువాత పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్లంతా ఒండ్రు మట్టి పేరుకుపోవడంతో ఆ దృశ్యాలను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇలా శుభ్రం చేసుకునేందుకు సుమారు 20 రోజులు పడుతుందని.. అప్పటివరకు ఎక్కడ ఉండి వండుకు తినాలో తెలియక మనోవేదనకు గురవుతున్నారు.


గన్నవరంలో వరద తగ్గిన తరువాత ఇంట్లో బురదను తొలగిస్తున్న దంపతులు

క్లుప్తంగా

పాముకాటుకు గిరిజనుడు మృతి


హతమైన నాగుపాము


రాజారావు(ఫైల్)

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ పొత్త డిగొంది గ్రామానికి చెందిన గిరిజనుడు సోమవారం సాయంత్రం పాముకాటుకు గురై మృతి చెందాడు. పొత్తడిగొంది గ్రామానికి చెందిన జన్ని రాజారావు(32) పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చి చలిమంట వేసుకోవటానికి కట్టెలను తీస్తున్న సమయంలో పాటుకాటు వేసింది. దీంతో కేకలు వేయడంతో స్పందించిన కుటుంబీకులు హుటాహుటిన రాజారావును గెమ్మెలి పీహెచ్‌సీకి తరలించారు. మార్గ మధ్యలో ఆయన మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా మృతుడు రాజారావు ఇంటి సమీపంలో సంచరిస్తున్న పాముని స్థానికులు గుర్తించి హతమార్చారు.

జి.మాడుగుల ఎంపీపీ పదవికి రాజీనామా


జెడ్పీ సీఈవో పోలినాయుడుకు రాజీనామా లేఖను అందజేస్తున్న ఎంపీపీ పద్మ

జి.మాడుగుల: మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) పదవికి కొర్రా పద్మ రాజీనామా చేశారు. ఈమేరకు ఉమ్మడి విశాఖ జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడుకు తన రాజీనామా లేఖను మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు ఆమె లేఖలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు లంబూరి అప్పలరాజు, ఈశ్వరరావు, అప్పారావు, జిల్లా నాయకులు గోవిందరావు, కృష్ణమూర్తి, వంజరి చిరంజీవినాయుడు పాల్గొన్నారు.

బ్రహ్మకమలాల కనువిందు



సాక్షి,పాడేరు: పట్టణంలోని గుడివాడ మెట్టవీధిలో బ్రహ్మకమలాలు మంగళవారం రాత్రి కనువిందు చేశాయి.ఇక్కడ నివసిస్తున్న జి.గోవింద్,అమ్మాజి దంపతులు మూడేళ్ల క్రితం బ్రహ్మకమలం మొక్కను తమ ఇంటి ముందు కుండీలో నాటుకున్నారు. ఏటా సుమారు 20 వరకు బ్రహ్మకమలాలు వికసిస్తున్నాయని వారు తెలిపారు.

అబద్ధాల అనిత!

- పోలీస్ కార్యాలయంలో హోం మంత్రి అనిత రాజకీయ విమర్శలు
- ఐపీఎస్‌లను పక్కన కూర్చోబెట్టుకొని మరీ వైఎస్సార్ సీపీ పాలనపై ఆరోపణలు
- రాజకీయ వేదికగా మారిపోయిన పోలీస్ సమావేశ మందిరం
- గంజాయి నియంత్రణ, పోలీస్ వాహనాలు, సిబ్బంది సంక్షేమంపై అవాస్తవాలు
- గత అయిదేళ్లలో పోలీసులు పనిచేయలేదన్నట్లు పరోక్ష ప్రకటనలు
- నోరెళ్లబెట్టిన పోలీస్ ఉన్నతాధికారులు

విశాఖ సిటీ: నోరు విప్పితే అబద్ధం. అడ్డూ అదుపూ లేకుండా ఉద్దేశపూరిత విమర్శలు.. ఊహించని పదవి వరించడంతో ఇష్టానుసారంగా రెచ్చిపోయి ఆరోపణలు.. అధిష్టానం మెప్పు కోసం తాపత్రయపడుతూ హడావుడి చేస్తున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ వేదికగా మార్చేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం పెట్టి.. అదనపు డైరెక్టర్ జనరల్, ఐజీ స్థాయి అధికారులను పక్కన కూర్చోబెట్టుకొని మరీ రాజకీయ దురుద్దేశ ఆరోపణలు గుప్పించారు. వాస్తవాలను కప్పిపుచ్చి, నోటికొచ్చినట్లు అవాస్తవాలను చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో పోలీస్ అధికారులు పనిచేయలేదనట్లు పరోక్ష విమర్శలు చేశారు. పాపం.. ఐపీఎస్ అధికారులు సైతం మంత్రి ఆరోపణలకు అడ్డుచెప్పలేక, నోరువిప్పలేక తలూపడానికే పరిమితమయ్యారు.

గంజాయిపై కప్పగెంతులు


గంజాయి.. కాపులుప్పాడలో 22వేల కేజీల గంజాయిని దగ్ధం చేస్తున్న అప్పటి సీపీ శ్రీకాంత్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ గంజాయి కేంద్రంగా మారిందని విపరీతంగా ప్రచారం చేశారు. టీడీపీ అధికారం చెపట్టాక గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేశారు. ఇప్పటి వరకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా గంజాయి రవాణ చేస్తున్న వారిని పట్టుకోవడం మినహా.. ఉమ్మడి విశాఖలో ఒక్క చోట కూడా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసిన సందర్భాలు లేవు. వాస్తవానికి విశాఖలో ఎక్కడా గంజాయి సాగు లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పంటలను సైతం గత ప్రభుత్వ హయాంలో గుర్తించి ధ్వంసం చేశారు. ఇదే విషయాన్ని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన రోజునే మీడియాతో స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాను రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలోనే అల్లూరి జిల్లాలో దాదాపుగా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. హోం మంత్రి అనిత మాత్రం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు ఎక్కువగా ఉందని ఆరోపణలు చేశారు. అలా ఉంటే.. ఇప్పటి వరకు ఎందుకు వాటిపై చర్య తీసుకోలేదన్నది మాత్రం మిలియన్ డాలర్ ప్రశ్న. ఇదిలా ఉంటే అప్పుడు విశాఖ సీపీ తప్పు చెప్పారా? ఇప్పుడు హోం మంత్రి రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేశారా? అన్నది త్వరలోనే తెలిసిపోతుంది. హోం మంత్రి అనిత అల్లూరి జిల్లాలో ఎన్ని వేల ఎకరాల్లో గంజాయి సాగు జరుగుతుందో గుర్తించి ధ్వంసం చేస్తారో వేచి చూడాలి మరి.

చెప్పేదొకటి.. చేసేదొకటి..

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో అశాంతి నెలకొంది. ఒకవైపు హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలతో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. మరోవైపు కాలం చెల్లిన మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ప్రధానంగా విశాఖలో పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. అందుకు ఇటీవల వరుసగా పోలీసులపై జరుగుతున్న దాడులే నిదర్శనం. మహిళల భద్రతే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పుకొస్తున్న హోం మంత్రి అనిత ఇప్పటివరకు రాంబిల్లి, అనకాపల్లి ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో బాధితులను కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో బాధిత కుటుంబాలకు రూ.లక్షలు నష్టపరిహారం అందించి భరోసా అందించగా.. ఈ టీడీపీ ప్రభుత్వంలో మాత్రం పైసా కూడా విదల్చడం లేదు. అలాగే ఎన్నికల ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాణ్యతలేని లిక్కర్ విక్రయిస్తున్నారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, అనితలు.. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ అదే మద్యాన్ని విక్రయిస్తు న్నారు. కేవలం అధికారంలోకి రావడానికి అప్ప టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లినట్లు ఇప్పుడు అందరికీ స్పష్టంగా అర్థమవుతోంది. ఇదిలా ఉంటే.. అదే ప్రభుత్వ మద్యం దుకాణా ల్లో కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తుండడం ఇప్పు డు సంచలనంగా మారింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టినప్పటికీ.. ప్రభు త్వం గానీ, హోం మంత్రి అనిత గానీ ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం.

సీపీ ఆఫీస్‌లో రాజకీయ విమర్శలా?


కమిషనరేట్‌లో పోలీస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖ పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులను పక్కన పెట్టుకొని హోం మంత్రి రాజకీయ ఆరోపణలు చేయడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి పోలీస్ లేదా ఇతర ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా.. మంత్రులు ఎటువంటి సమావేశాలు నిర్వహించినా.. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావించడం అనవాయితీగా వస్తోంది. రాజకీయ ఆరోపణలు, విమర్శలకు ప్రభుత్వ అతిథి గృహం లేదా వారి క్యాంప్ కార్యాలయాల్లో మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. గతంలో సర్క్యూట్ హౌస్‌లో మంత్రులు అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించగా.. రాజకీయ ఆరోపణలు చేసిన సమయంలో అధికారులు వెంటనే వేదికపై నుంచి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి అనిత మాత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ ఆరోపణలకు వేదికగా చేసుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ ఫక్కీరప్ప, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నంలను పక్కన కూర్చోబెట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకున్నట్లు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా వాస్తవాలను వక్రీకరించి.. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు అసలు పని చేయలేదన్న విధంగా ఆరోపణలు చేయడం గమనార్హం. గంజాయి నియంత్రణ, పోలీస్ అధికారులకు వాహనాలు, ఇతర సదుపాయాలు, సిబ్బంది సంక్షేమం, ఇలా అన్ని విషయాలపై అబద్ధాలు వల్లెవేశారు.

అధునాతన వాహనాలను సమకూర్చినా..


వాహనాలను ప్రారంభిస్తున్న అప్పటి జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, అప్పటి కమిషనర్ శ్రీకాంత్

పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో కూడా హోం మంత్రి అనిత అబద్ధాలు వల్లెవేశారు. ముఖ్యంగా పోలీసులకు గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో వాహనాలు సమకూర్చలేదని, దీంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు చేశారు. 2014–19 మధ్య తెలుగుదేశమే అధికారంలో ఉంది. 'అప్పుడెందుకు పోలీసులకు వాహనాలను సమకూర్చలేదు? ఒకవేళ అప్పుడే కొనుగోలు చేస్తే.. వాహనాల కొరత ఎందుకు వచ్చింది? లేదా.. అవి రెండు, మూడేళ్లకే పాడైపోయాయా? మాయమైపోయాయా' అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయన్న విషయాన్ని విస్మరించారు. టీడీపీ పాలనలో పోలీసులకు వాహనాలను అందించకపోగా.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీపై తప్పుడు ఆరోపణలకు పూనుకున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో విశాఖ పోలీసులకు ప్రభుత్వం నుంచే కాకుండా కొన్ని పరిశ్రమలు, సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో వాహనాలు సమకూరాయి. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రత కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 163 అధునాతన దిశ పెట్రోలింగ్ వాహనాలను ఆవిష్కరించి విశాఖతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కేటాయించారు. అలాగే 32 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలు, ఒక టోయింగ్, రెండు ఇసుజు వెహికల్స్ అందుబాటులోకి వచ్చాయి. హోం మంత్రి మాత్రం ఒక్క వాహనం కూడా అందించలేదని వాస్తవాలు వక్రీకరించే ప్రయత్నం చేశారు. అలాగే గతంలో పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించినప్పటికీ.. పట్టించుకోలేదని మంత్రి ఆరోపణలు చేశారు.

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: విద్య, వైద్య రంగాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన మండల సర్వసభ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్య, వైద్య ఆరోగ్యం, రోడ్లు, భవన నిర్మాణల శాఖ, మరియు మంచినీరు, పంచాయిత్‌రాజ్, ఎన్‌ఆర్‌జీఎస్ శాఖలతో పాటు పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యారంగంలో నాణ్యమైన విద్య అందేల అధికారులు దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉత్తమ వైద్య సేవలందించాలని వైద్యాధికారులకు సూచించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు,భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆశాఖ అధికారులకు కోరారు. మంచినీరు సమస్య కలిగిన గ్రామాలకు మంచి నీరు సమస్యలు తీరేలా దృష్టి పెట్టాలని కోరారు. ఇటీవల జర్రకొండ సర్పంచ్ చిట్టిబాబు, ప్రజాప్రతినిధులపై స్థానిక ఎస్ఐ సతీష్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. అందరు కలిసి ఆయనకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఎంపీడీవో వెంకటరావు, డీటీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కనీస సామర్థ్యం లేకపోతే ఎలా?

- కిలగాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పనితీరుపై డీఈవో బ్రహ్మాజీరావు ఆగ్రహం


కిలగాడ హెచ్‌ఎం నీలకంఠంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు


పెదబయలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే కనీస సామర్థ్యం లేకపోతే ఎలా అని డీఈవో పి.బ్రహ్మాజీరావు ప్రశ్నించారు. మండలంలోని కిలగాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల నోట్,వర్కు పుస్తకాలను తనిఖీ చేశారు. పలు ప్రశ్నలు వేయగా వారు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో డీఈవో అసహనం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ, విద్యార్థుల సామర్థ్యం సక్రమంగా లేకపోవడం,పాఠశాల రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటంతో హెచ్‌ఎం నీలకంఠంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు పూర్తిగా మార్చుకోవాలని, లేకుంటే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు.అనంతరం కిలగాడ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనను పర్యవేక్షించారు. బోధన విధానంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నూరుశాతం హాజరు తప్పనిసరి

పెదబయలు: ప్రతి పాఠశాలలో విద్యార్థుల నూరుశాతం హాజరు ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు.మంగళవారం ఆయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. గణితశాస్త్రంపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రతీ ఉపాధ్యాయుడు సబ్జెట్ వారిగా పాఠ్యాంశాల బోధన జరగాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై హెచ్ ఎం,ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతనం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ సబ్జెక్టులకు అధ్యాపకులు కొరత ఉందని హెచ్‌ఎం తెలిపారు. దీనిపై సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈవోను ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఎంఈవో కృష్ణమూర్తి, పాఠశాల హెచ్ ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతో ముందుకు సాగాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గిరిజన విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని గుత్తులపుట్టు, దిగుమోదాపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ పొందుతున్న సూపర్ ఫిఫ్టీ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పదికి పదికి గ్రేడ్ పాయింట్లు సాధించేలా ఇప్పటినుంచి ప్రణాళికపరంగా చదవాలన్నారు. పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధిస్తే కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశం లభిస్తుందన్నారు. ఇంటర్ తర్వాత ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, నీట్, ఎంసెట్ వంటి పరీక్షలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఏపీపీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, యూపీఎస్సీ నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్షలపై విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ప్రతి ఆదివారం సందేశాత్మక చలన చిత్రాలను ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్. రజని, ఉపాధ్యాయులు ఉన్నారు.

హుకుంపేట ఎస్‌ఐపై ఫిర్యాదు


హుకుంపేట ఎస్‌ఐపై ఫిర్యాదు చేస్తున్న ప్రజా ప్రతినిధులు

హుకుంపేట: మండల ప్రజాప్రతినిధులపై దురుసుగా ప్రవర్తిస్తున్న ఎస్సై సతీష్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంగళవారం పాడేరు ఎస్పీ కార్యాలయంలో సీఐ హిమగిరికి ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అందరి ముందు దుర్భాషలాడుతూ జైలుకు పంపిస్తానని హెచ్చరించటం, అవమానించడం దారుణమన్నారు. ఇటీవల జర్రకొండ సర్పంచ్ కొర్ర చిట్టిబాబును గంజాయి రైతులతో కలిపి ఫొటోలు తీసి జైలుకు పంపిస్తానని బెదిరించారని వాపోయారు. డబ్బులు ఇవ్వనివారిపై కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నైని సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.65 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 34 రోజులకు గాను రూ. 2,65,72,189 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో రెండో రోజు మంగళవారం హుండీల ఆదాయం లెక్కించారు. తొలి రోజు 14 హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.1,97,06,300 నగదుతో పాటు 100.950 గ్రాముల బంగారం, 11.800 గ్రాముల వెండి లభించగా.. రెండో రోజు మంగళవారం 20 హుండీల ద్వారా రూ.68,65,889 నగదు, 86 గ్రాముల బంగారం, 1.700 కిలోల వెండి వచ్చినట్టు ఈవో తెలిపారు. మొత్తం రెండు రోజుల్లో రూ.2,65,72,189 ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. రోజుకు సరాసరి రూ.7,81,535 హుండీ ఆదాయం వచ్చినట్టు తెలిపారు. అలాగే మొత్తం బంగారం 186.950 గ్రాములు, వెండి 13.500 కిలోలు వచ్చినట్టు వివరించారు.

గంజాయితో పట్టుబడిన ముగ్గురి అరెస్టు

నాతవరం: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు నాతవరం ఎస్ఐ ఎం.రామారావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు తెలిపిన వివరాలు. నర్సీపట్నం–తుని మధ్య తాండవ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌లు తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నాయన్నారు. తమిళనాడుకు చెందిన సంబుల్ తుంబైన్, అరుద్దున్ దుక్కన్, ఐల్‌గోదాముగన్‌లను స్టేషన్‌కు తరలించామన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

మోదకొండమ్మ మొక్కు తీర్చుకున్న పాడేరు ఎమ్మెల్యే


పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దంపతులకు జ్ఞాపిక అందించి సత్కరిస్తున్న కమిటీ చైర్మన్, సభ్యులు


మోదకొండమ్మను దర్శించుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దంపతులు

మాడుగుల: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తన సతీమణి జీకే వీధి జెడ్పీటీసీ శివరత్నంతో కలసి మంగళవారం శాకంబరీదేవి అలంకరణలో ఉన్న మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, భీశెట్టి పైడయ్యనాయుడు, శ్రీనాదు శ్రీనువాసరావు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, అమ్మవారి జ్ఞాపికతోపాటు ప్రసాదాలు అందించి, సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రసాద్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు కుప్పిలి భవానీశంకర్, ఢిల్లీ నానాజీ, ధర్మిశెట్టి అప్పారావు, పల్లెల రాము, శీలామంతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో వ్యక్తిపై దాడి


దాడిలో గాయపడిన పిల్లా శ్రీనివాసరావు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో పెంజెరువు కనకదుర్గమ్మ గుడి దగ్గర మంగళవారం భూవివాదం కారణంగా ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో పట్టణంలోని పాతవీధికి చెందిన పిల్లా శ్రీనివాసరావు(35) తీవ్రంగా గాయపడ్డాడు. శెలంశెట్టి తనకేష్ అనే వ్యక్తి కర్రతో తలపై దాడి చేయడంతో పిల్లా శ్రీనుకు తీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలో కుప్పకూలిపోయాడు. దీంతో గాయపడిన శ్రీనును బంధువులు యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్ఐ సావిత్రి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

స్కీమ్ పేరుతో మోసంపై ఫిర్యాదు

అనకాపల్లి : చీటీల పేరుతో మోసం చేసిన స్థానిక శ్రీ లక్ష్మీ గణపతి లక్కీ స్కీమ్ ఓనర్ కాంతారావుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. కుంచావారి వీధికి చెందిన వి.మల్లికార్జునరావు 2022 అక్టోబర్ మాసంలో కాంతారావుకు లక్ష్మి స్కీమ్ పేరుతో నెలకు రూ.3వేలు చొప్పున 33 నెలలు చెల్లించడం జరిగిందని, స్కీమ్‌పూర్తి అయినప్పటికీ నేటికీ నగదు ఇవ్వకపోవడంతో మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.